VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 02 అక్టోబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 77

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## తెలంగాణ ఉద్యమంలో ముందున్న గాంధీ




నేటినుంచి ఉభయ రాష్ట్రాల్లో స్కూళ్లకు

## సెలవులు

తిరిగి 14న తెరుచుకోనున్న పాఠశాలలు




## నేటినుంచే బతుకమ్మ సందడి



ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేత ప్రారంభం

పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్న పనులు

ఖాళీ చేసిన వారిని డబుల్ ఇళ్లకు తరలింపు

# మూసీ ఇళ్ల కూల్చివేత మొదలు

**హైదరాబాద్:** మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి. చాదర్‌ఘాట్ శంకర్ నగర్ బస్తీలో కూల్చివేతలను మంగళవారం ఉదయం అధికారులు ప్రారంభించారు. ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించారు. దాదాపు 140 ఇళ్లు ఖాళీ అయ్యాయి. ఇళ్లు ఖాళీ చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు సమాచారం. ఈ క్రమంలో మలక్‌పేట పరిధిలోని శంకర్‌నగర్‌లో మూసీ రివర్‌బెడ్‌లోని ఇళ్ల కూల్చివేతలను అధికారులు చేపట్టారు. ఇక్కడ స్వచ్ఛందంగా ఖాళీ చేసిన నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండటంతో కూలీల సహాయంతో కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. నిర్వాసితులను రెండు పడక గదుల ఇళ్లకు తరలిస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేశారు. మరోవైపు అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్‌లో మూసీ పరీవాహక ప్రాంత వాసులను భారాస


మిగతా 2లో




## భద్రతపై ఇచ్చిన హామీలపై కానరాని చర్యలు

సిఎం మమతా బెనర్జీ చర్యలపై వైద్యుల అనుమానం

మరోమారు ఆందోళనకు దిగిన జూనియర్ డాక్టర్లు




## లైసెన్స్‌డు రివాల్వర్ మిస్‌ఫైర్

నటుడు గోవిందా కాలులోకి దూసుకెళ్లిన బుల్లెట్

హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

ప్రమాదం లేదని తెలిపిన వైద్యులు

## బిజెపి దీక్షతో కాంగ్రెస్‌లో భయం




ఇందిరాపార్క్ వద్ద దీక్షలో ఎంపి అర్వింద్

హైడ్రాపై హైకోర్ట్ మొట్టి కాయలు వేసిందన్నారు. ముస్లింల ఇండ్లను ముట్టుకోలేదు. చుట్టాలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ టార్గెట్ అంతా హిందువులే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరించడం , బ్లాక్ మెయిల్ చేయడం రేవంత్ నైజమన్నారు.

## మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

ఎమ్మెల్యేలతో కలసి అంబర్‌పేటలో పర్యటన

బాధితులకు భరోసా ఇచ్చిన బిఆర్ఎస్ నేతలు




## ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్సీ కవిత

వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి కవిత

జైలులో ఉండగా పలు ఆరోగ్య సమస్యలు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంగళవారం వైద్యపరీక్షల కోసం గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్లో చేరారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో పలుసార్లు తీవ్ర అనారోగ్యానికి కవిత గురైన విషయం తెలిసిందే. గతంలో తిహాడ్ జైల్లో ఉండగా కవిత రెండుసార్లు అస్వస్థతకు లోనయ్యారు. జూలై 16న తొలిసారిగా కవితను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత జూలై 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి కవిత తీసుకెళ్లారు.ఆ తర్వాత ఆమె విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే కవితకు వైద్యం అందించారు. ఆ తర్వాత ఆగస్టు-22న మరోసారి కవిత అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, తిరిగి జైలుకు తీసుకెళ్లారు. కొంతకాలంగా కవిత గైనిక్ సమస్యలతో బాధపడుతూ ఉండటం.. దీనికి తోడు ఇటీవల వైరల్ జ్వరం బారినపడ్డారు. దీంతో.. కవిత భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. కవిత జైల్లో ఉండగా 11 కిలోల బరువు తగ్గారు. ఈ విషయాన్ని స్వయంగా ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పడంతో కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆందోళన చెందిన పరిస్థితి. ఆమె సుమారు ఐదున్నర నెలలు జైలులోనే ఉన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత ఆమె సుమారు 11 కేజీల బరువు తగ్గారు.అంతేకాదు.. సోదరి పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన అన్న.. ఒక్కొక్కటిగా విషయాలను బయటకు చెప్పారు. కవితకు బీపీ పెరగడంతో మాత్రలు వేసుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాదు.. జైలు శుభ్రంగా లేదని, కవిత చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 11 వేల మంది ఖైదీలు ఉండాల్సిన తిహాడ్ జైల్లో 30 వేల మంది ఉన్నారని తెలిపారు. బెయిల్ విషయంలో ట్రయల్ కోర్టుతో పాటు హైకోర్టులో కూడా కవితకు నిరాశే ఎదురైంది. ఈ ఏడాది ఆగస్టు-27న కవిత బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

## కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదు

### బిజెపి దీక్షలో మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



**హైదరాబాద్:** మాట వినని వాడు సైకో అవుతాడు.. ప్రజలను ఏడిపించి .. సంతోషించే వాడు శాడిస్ట్ అవుతాడని అంటూ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల మాట్లాడుతూ.. కాంగ్రెస్ తాట తీసే శక్తి ప్రజలకు, రైతులకు ఉంటుందన్నారు. ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. మీ అంతరాత్మ సాక్షిగా ఏది అనిపిస్తే అది చెప్పండి. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన చిలుక పలుకులు మాట్లాడితే మీ గౌరవం పోతుందని మంత్రి తుమ్మలను ఉద్దేశించి హితవుపలికారు. ప్రభుత్వం ఇస్తా అన్న 2 లక్షల రూపాయలు రైతుల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బొంద పెడతారన్నారు. రెండు మూడు రోజుల్లో రింగ్ రోడ్డు వద్ద ధర్నా చేస్తామన్నారు. సాక్షాత్తు హైకోర్టు హైడ్రాపై మొట్టికాయలు వేసిందని.. అవి వేసింది హైడ్రాపై కాదు నేరుగా సీఎం రేవంత్ రెడ్డికి వేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. కోర్టు వ్యాఖ్యలతో అయినా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న. ప్రజలు నీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం అంటూ ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలి అనే ధ్యాసనే ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా ఓటు వేయరన్నారు.

## మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందెవరు?

హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది వాస్తవం కాదా? అని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భారాస చేసిన పనులను ఆ పార్టీ నేతలు మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఆర్భాటంగా ప్రకటించి.. కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను కూడా నియమించారని గుర్తు చేశారు.“2018లో మూసీ నదికి సంబంధించిన ప్రాజెక్టును ఏవిధంగా చేపట్టాలనే దానిపై సమావేశం నిర్వహించారు. రివర్ బెడ్‌లో ఆక్రమణల లెక్కలు తీయాలని చెప్పారు. మూసీనదికి బౌండరీతో పాటు బఫర్ జోన్ ఫిక్స్ చేయాలన్నారు. మూసీకి ఇరు వైపులా 50 మీటర్లను బఫర్ జోన్‌గా గుర్తించాలని జీవో జారీ చేశారు. కాలుష్యం తీవ్రంగా ఉంది, కాలుష్య రహితంగా చేస్తామని చెప్పారు. రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళిక కూడా రూపొందించారు. మూసీనది ప్రక్షాళనపై అప్పటి మంత్రి కేటీఆర్ ఎన్నో సమావేశాలు నిర్వహించారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించాలని నాటి సమావేశాల్లో ఆదేశించారు.వారి లెక్క ప్రకారం 8,480 అక్రమ నిర్మాణాలను ఆనాటి వరకు అధికారులు గుర్తించారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని 2021లోనే కేటీఆర్ ఆదేశించారు. మూసీ నిర్వాసితులకు పరిహారంపై కూడా కేటీఆర్ చర్చించారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించాలనే ఆలోచన చేశారని మేం కూడా అనుకున్నాం. కానీ, పేపర్లకే పరిమితమై.. మాటలతోనే కాలం గడిపారు. మూసీ



రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైంది. సమస్యలను భారాస నేతలు ఇంకా జఠిలం చేస్తున్నారు. అందరికీ ఉపయోగపడే పనులపై భారాస నేతలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. అందరితో చర్చించి ముందుకెళు_ంటే మా మీద బురద జల్లుతున్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారో మర్చిపోయారా? ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ఇవ్వకుండానే బలవంతంగా వెళ్లగొట్టారు. మూసీ నిర్వాసితులకు మరో చోట ఆవాసం కల్పిస్తున్నాం. ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాం. దీంతో మూసీ పరిధిలో చాలా మంది స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేస్తున్నారు” అన శ్రీధర్‌బాబు తెలిపారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2
బుధవారం 02 అక్టోబర్ 2024



# తెలంగాణ ఉద్యమంలో ముందున్న గాంధీ అహింసా విధానంలో రాష్ట్రం సాధన

**హైదరాబాద్:** నేటి ఆధునిక సమాజంలో గాంధీ ఉద్యమ పంథాను ఎంచుకున్న కారణంగానే ప్రత్యేక తెలంగాణ సాధ్యం అయ్యింది. దేశంలో ఎక్కడైనా ఇప్పుడు గాంధీ సూచించిన గ్రామీణ ఉద్యమాన్ని తాము ముందుకు తీసుకుని వెళుతున్నామని నేతలు కూడా ప్రకటిస్తున్నారు. ఈ మధ్య గాంధీకి తగిన గౌరవం దక్కడం లేదని కూడా అంటున్నారు. తెలంగాణ ఉద్యమం సొంతం గాంధేయ మార్గంలోనే నడిచింది. అహింసామార్గంలో కేవలం నిరసనలు, అరెస్టలతో ఉద్యమాన్ని గాంధీ అహింసామార్గంలో పయనించేలా చేయడంలో ఉద్యమకారులు కృతకృత్యులయ్యారు. అయితే ఆనాడు గాందీకి ఎదురైన సంఘటనలు తెలంగాణ ఉద్యమంలోనూ కానవచ్చాయి. బలిదానాలు ఇందులో ప్రధానంగా చెప్పుకోవాలి. తెలంగాణ కోసం ఎలుగెత్తిన ఎందరో యువకిశోరాలు తమ జీవితాలను త్యాగం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న కెసిఆర్ కావచ్చు, ప్రొఫెసర్ కోదండరామ్ కావచ్చు..యాత్ తెలంగాణ ప్రజలు గాంధీ అనుసరించిన అహింసామార్గంలోనే ముందుకు సాగారు. అందుకే ఎక్కడా హింసకు తావులేకుండా ఉద్యమం సాగి విజయం సాధించింది. ఇది ప్రపంచానికి మరోమారు గాంధీ గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది. గాంధీ పేరు ఎత్తుకున్న తర్వాత ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోయాయి. పైగా ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా రోడ్లపైకి వచ్చి ఉద్యమించారు. ఇది మన కళ్ల ముందు జరిగిన చరిత్ర. ఈ ఉద్యమం విజయం సాధించింది. 1952 కానీ, 1969 ఉద్యమాల్లో గాంధీ సిద్దాంత ప్రస్తావన లేదు. అందు వల్ల నాటి ప్రభుత్వాలు ఆనాటి ఉద్యమాన్ని అణిచివేయగలిగాయి. ఈ సారి ఉద్యమంలో గాంధీ ముందు వరుసలో ఉన్నారు. గాంధీ సిద్దాంత ఆధార ఉద్యమమని ఆచరణ ద్వారా ఉద్యమ నాయకత్వం చూపించింది. అందువల్ల తెలంగాణకు పోరాటాలే తప్ప విజయాలు లేవు అనే వేదనను తొలగించింది గాంధీ మార్గమే.

## నేటినుంచి ఉభయ రాష్ట్రాల్లో స్కూళ్లకు సెలవులు

**అమరావతి/హైదరాబాద్:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో స్కూళ్లకు బుధవారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. బుధవారం అక్టోబర్ 2న గాంధీజయంతి కాగా, 3 నుంచి సెలవులు ప్రకటించారు. తిరిగి 14న స్కూళ్లు తెరచుకోనున్నాయి. ఇదే క్రమంలో ఏపీలో పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీచర్ల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని దసరా సెలవుల తేదీలను ఒక రోజుకు ముందుకు మార్చారు. తొలుత అక్టోబర్ 4 నుంచి 13 వరకు సెలవులను ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యర్థనలు రాగా.. ఈ సెలవులను అక్టోబర్ 3 నుంచి 13 వరకు మార్చారు. 14న పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ నెలలో అటు తెలంగాణ.. ఇటు ఆంధ్రప్రదేశ్ లోని స్కూళ్లు, పాఠశాలలకు సెలవులే సెలవులు ఉండనున్నాయి. ఈ సంవత్సరంలో అత్యధికంగా ఈ నెలలోనే ఎక్కువ పండుగలు వచ్చాయి. దసరా, దీపావళి పండుగలు ఒకే నెలలో రావడంతో విద్యార్థులకు భారీగా సెలవులు లభించాయి. ఈ రెండు పండుగుల దృష్ట్యా అక్టోబర్ నెలలో ఏకంగా స్కూల్స్ 16 రోజుల పాటు మూతపడనున్నాయి. అక్టోబర్ 3 నుంచి 14 వరకు ఏపీలో దసరా సెలవులు ప్రకటించగా.. అక్టోబర్ 2 నుంచి 14 వరకు ఏకంగా 13 రోజుల పాటు తెలంగాణ సర్కార్ దసరా సెలవులు ప్రకటించింది. తెలంగాణలో బతుకమ్మ సంబరాలు కూడా దసరా పండుగ ముందు ప్రారంభం కానున్నాయి. ఈ సంబరాలు మొత్తం 9 రోజులు ఉంటాయి. ఎంగిలి బతుకమ్మ పండుగ అక్టోబర్ 2న ఉండనుంది. ఆరోజు ఎలాగో గాంధీ జయంతి కాబట్టి.. పాఠశాలలకు అఫీషియల్ హాలిడే. అక్టోబర్ 31న దీపావళి పండుగ సందర్భంగా.. స్కూల్స్, కాలేజీలకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 20, 27 తేదీల్లో ఆదివారాలు కూడా కలిపి ఏకంగా ఈ నెల దాదాపుగా 16 రోజులు విద్యార్థులకు సెలవులు ఉంటాయి. అంటే.. అక్టోబర్‌లో స్కూల్స్ పని చేసేది కేవలం 14 రోజులు మాత్రమే.

## నేటినుంచే బతుకమ్మ సందడి

**నిజామాబాద్:** శరన్నవరాత్రులు, బతుకమ్మ పండుగ ఈ రెండు కలగలిపి రావడంతో తెలుగు రాష్ట్రాల్లో సందడి నెలకొననుంది. బెంగాల్లో దుర్గా నవరాత్రులు వైభవంగా చేస్తారు. ఎపిలో కూడా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతాయి. దీంతో అమ్మవారి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. బాసర, ధర్మపురి, విజయవాడ, శ్రీశైలం ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా సాగుతాయి. బుధవారం అమావస్యతో పెతరమావాస్యగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు మొదలవుతాయి. అలాగే పెద్దలకు బియ్యం ఇవ్వడం తెలంగాణలో ఆనవాయితీ. ఇది అమావాస్యరోజు పెద్ద ఎత్తున చేపడతారు. ఇదే క్రమంలో తెలంగాణ పూల జాతర బతుకమ్మలకు కూడా ప్రత్యేకత ఉంది. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ ఏటా 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగుతుంది. ప్రతీ యేటా భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వీయుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి ఆడిపాడుతారు.

పూలతో ముచ్చటగా బతుకమ్మలు తయారు చేసి అంతా కలసి ఆడిపాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయి. తీరొక్క పూలను అందంగా స్తూపం, శంఖం, గోపురం ఆకారంలో అమర్చుకుంటారు. బతుకమ్మను ప్రధానంగా తంగేడు పూలు, గునుగు, గుమ్మడి, మందార, బంతి, చేమంతి, అడవి చామంతి, గోరింట, బీర పువ్వులతో పేరుస్తుంటారు. ఈ ఏడాది బతుకమ్మ పండుగ అక్టోబర్ 2 నుంచి 10 తేదీ వరకు జరుపుకోనున్నారు. ఈ యేడు విస్తారంగా కురిసి చెరువులు కుంటలు నిండడంతో ఎక్కడ చూసిన అడవి పూలు అందంగా విరబూసి పలకరిస్తున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు అనుగుణంగా బతుకమ్మ పేర్లు కూడా ఉంటాయి. సద్దుల బతుకమ్మ చివరి రోజు పోయిరా బతుకమ్మ అంటూ వాటిని నీటిలో వదిలి ఆడవాళ్ళు అమ్మవారికి నమస్కారం చేసుకుంటారు. స్కూళ్లకు కూడా 2వ తేదీ నుంచి సెలవులు ప్రకటించారు. దీంతో ప్రజలు ముఖ్యంగా ఆడబిడ్డలు పల్లెలకు తరలి వెళతారు. దీంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొననుంది.

# మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ

**హైదరాబాద్:** మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి



కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ..

హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూటో.. దిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర

బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు

. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే

దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగెట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు.

# బిజెపి దీక్షతో కాంగ్రెస్‌లో భయం

**హైదరాబాద్:** బీజేపీ చేపట్టిన రైతుదీక్షతో కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రైతు దీక్ష కొనసాగుతోంది. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ 24 గంటల నిరంతర దీక్షలో ఉన్నారు. వీరి దీక్షకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. మంగళవారం ఉదయం ఇందిరాపార్క్ వద్దకు చేరుకున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ దీక్షకు మద్దతుతెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీక్షపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారని... ఆయనకు వయసు మీద పడిందంటూ వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్ ప్రాంతీయ పంటలను విస్మరించారని.. ఇప్పుడు రేవంత్ అదే ఫాలో అవుతున్నారని మండిపడ్డారు. హైడ్రాపై హైకోర్ట్ మొట్టి కాయలు



వేసిందన్నారు. ముస్లింల ఇండ్లను ముట్టుకోలేదు. చుట్టాలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ టార్గెట్ అంతా హిందువులే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరించడం , బ్లాక్ మెయిల్ చేయడం రేవంత్ నైజమన్నారు. 2 పంటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయం చేశారన్నారు. గుజరాత్ ఆదాయం మోదీ హయాంలో ఎంత పెరిగిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలనే ధ్యాసనే ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. వచ్చే ఎన్నికల్లో ఉంటాడో పీకుతాడో తెలియదంటూ కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా ఓటు వేయరన్నారు. మొన్నటి వరకు ముసలోడు కేసీఆర్ ఉండే ఇప్పుడు ఆయన వయస్సు 74. ఇక ఇతనితో ఏం కాదు అంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా... రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిర పార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. రుణమాఫీ సగంమందికి కూడా పూర్తి చేయలేదని బీజేపీ

ఆరోపిస్తోంది. వెంటనే అందరికీ 2 లక్షల రుణమాఫీ చేయాలని కమలం పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రైతు భరోసా, బోనస్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. బీజేపీ దీక్షపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేశారా అని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం రైతుల ఆదాయం రెట్టింపు చేసిందా అని మంత్రి తుమ్మల అడిగారు. మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు మహేశ్వర రెడ్డి, ఈటల కౌంటర్ ఇవ్వనున్నారు. ఈరోజు ఉదయం 11 గంటలకు 24 గంటల దీక్షను బీజేపీ నేతలు విరమించనున్నారు.

## మూసీ ఇళ్ల కూల్చివేత మొదలు



వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఈ కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. మా ఇళ్లు కూల్చడానికి మీరు ఎవరు..? ఇళ్లు కూల్చి ఇక్కడ పార్కులు కడతారా..? అని ప్రశ్నించారు. కాగా.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టకు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై గుర్తులు వేశారు. కాగా... ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. అయితే తమ ఇళ్లను కూల్చి వేస్తారంటూ ఆందోళన చెందిన స్థానిక ప్రజలను అధికారులపై తిరగబడ్డారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు భారీ పోలీసులు భద్రత నడుమ రెవెన్యూ అధికారులు ఇళ్లపై మార్క్ వేశారు. ప్రస్తుతం మరికొన్ని ప్రాంతాల్లో కూడా మార్క్ సర్వే ను అధికారులు కొనసాగిస్తున్నారు. పోలీసు భద్రత మధ్యే ఈ సర్వే సాగుతోంది. కూల్చివేయాల్సిన ఇళ్లకు అధికారులు మార్క్ వేస్తున్నారు.


## భద్రతపై ఇచ్చిన హామీలపై కానరాని చర్యలు

కోల్‌కతా:కోల్‌కతలాలో జూనియర్ వైద్యులు మరోమారు ఆందోళనకు దిగారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల నిరసనలు తెలిపిన వైద్య విద్యార్థులు ఇటీవల ఆందోళనలు విరమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూనియర్ వైద్యులు మంగళవారం తిరిగి ఆందోళనలు చేపట్టారు. తమ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి కనిపించడం లేదని వారు ఆరోపించారు. మా భద్రతకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల వైఖరి కనిపించడం లేదు. సీఎం మమతా బెనర్జీ చర్చల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించాం అని డాక్టరలు పేర్కొన్నారు. అదేవిధంగా తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఇది పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. ఇక, సెంట్రల్ కోల్‌కతాలోని స్వ్వర్ కళాశాల నుంచి ధర్మతల వరకు బుధవారం జూనియర్ వైద్యులు మార్చ్‌కు పిలుపునిచ్చారు. తమతో పాటు ఈ మార్చ్‌లో పాల్గొనాలని ప్రజలను కోరారు. పశ్చిమబెంగాల్‌లోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితురాలికి న్యాయం చేయాలని


వైద్య విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఘటన పెనుదుమారం రేపడంతో సుప్రీంకోర్టు దీన్ని సుమోటోగా స్వీకరించింది. ఈ క్రమంలో వైద్య విద్యార్థులు విధుల్లో చేరాలని సూచించింది. ఇక, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపి తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో 42 రోజులు కొనసాగించిన నిరసనలు విరమించి గతనెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. ఇదిలాఉండగా.. హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థికి న్యాయం చేయాలనేది వైద్య విద్యార్థుల ప్రధాన డిమాండ్. ఇక, ఆరోగ్య కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను విధుల నుంచి తొలగించడం, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో పోలీసుల రక్షణను పెంచాలని, శాశ్వత మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలనేవి వారి డిమాండ్లు.

## లైసెన్స్‌డు రివాల్వర్ మిస్‌ఫైర్

ముంబై: బాలీవుడ్ నటుడు, శివసేన నాయకుడు గోవిందా ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదవశాత్తు సొంత తుపాకీ పేలడం వల్ల గాయపడ్డారు. గోవింద దగ్గర లైసెన్స్ రివాల్వర్ ఉంది. తెల్లవారుఝామున 5 గంటల సమయంలో రివాల్వర్‌ను శుభ్రం చేస్తుండగా అది మిస్‌ఫైర్ అయ్యిందని తెలుస్తోంది. కాలికి తీవ్రంగా గాయమైంది. అప్రమత్తమైన సెక్యూరిటీ



సిబ్బంది గోవిందాను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తూ ఇంట్లో గన్ మిస్‌ఫైర్ కావడంతో కాలులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో ఆయన కాలుకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఆయన ఇంటి నుంచి కోల్‌కతాకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను తీసుకెళ్తుండగా అది చేయి నుంచి జారి కిందపడింది. దీంతో తుపాకీ పేలి కాలిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. వెంటనే వైద్యులు చికిత్స అందించి బు÷‌–లలెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, కొన్ని రోజులు ఆసుపత్రిలో ఉంటారని గోవిందా మేనేజర్ తెలిపారు. 1963లో పుట్టిన గోవిందా ప్రముఖ సీరియల్ 'మహాభారత్'లో అభిమన్యు పాత్ర కోసం మొదటిసారి ఆడిషన్ ఇచ్చారు. ఆ తర్వాత ఖుష్బూ సరసన 'తాన్ బదన్' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. అది విజయం సాధించడంతో వరుస అవకాశాలు అందుకున్నారు. 1991లో అమితాబ్, రజనీకాంత్‌లతో కలిసి ఆయన నటించిన 'హమ్' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. 2010లో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన రావణ్‌తో తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. 'నా తల్లిదండ్రుల ఆశీర్వాదం, మీ అందరి ప్రేమ వల్ల నేను ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాను. కాలులో బుల్లెట్ తొలగించారు' అని గోవిందా పేర్కొన్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిండే నటుడు గోవిందాతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను ఆదేశించారు.


వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
బుధవారం 02 అక్టోబర్ 2024

# సమిష్టి కృషితో వ్యవస్థలకు మేలు

## సమన్వయంతో ఫలితాలు

## లోక్ అదాలత్ సక్సెస్ మీట్ లో జిల్లాజడ్జి, పోలీస్ కమిషనర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 1**

రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమన్వయంతో అనుకున్న ఫలితాలు సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. సెప్టెంబర్ 28 న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతం అయిన నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ని సమావేశపు హల్ లో మంగళవారం నిర్వహించిన లోక్ అదాలత్ సక్సెస్ మీట్ లో ఆమె ప్రధానోపన్యాసం చేశారు. వినాయక చవితి పండుగ నవరాత్రులలో బందోబస్తు విధులలో తీరిక లేకుండా ఉన్న ఆ తరువాత లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి పోలీస్ శాఖ చాలా శ్రమించిందని ఆమె ప్రశంసించారు. పన్నెండు వేల రాజీపడదగిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమిస్తు, సమన్వయ పర్చుకుని తక్కువ సమయంలో ఎక్కువ క్రిమినల్ కేసుల పరిష్కారం లో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. కక్షిదారులను కేసుల రాజీ విషయంలో సమన్వయ పర్చుకుని కోర్టుల మెట్ల వరకు వారిని తీసుకుని రావడం లోక్ అదాలత్ చైతన్య దీప్తికి నిదర్శనమని జిల్లాజడ్జి తెలిపారు. జ్యూడిషియరి, పోలీస్ శాఖ మధ్య సమన్వయం భవిష్యత్ లోక్ అదాలత్ లకు ప్రేరణగా నిలవాలని ఆమె ఆదేశించారు. పోలీస్ కమిషనర్ కలమేశ్వర్ మాట్లాడుతూ, ఒక ప్రణాళిక ప్రకారమే పోలీస్ శాఖ సమన్వయం చేసుకుని లోక్ అదాలత్ విజయంలో తన పాత్రను పోషించిందని తెలిపారు. సమాజం పట్ల బాధ్యత, నేర రహిత వ్యవస్థ పట్ల లక్ష్యం లోక్ అదాలత్ కు మార్గం చూపించిందని అన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులను ఫిర్యాదుదారులు, బాధితులు కలిసి పరిష్కరించుకునే విధానంలో పోలీసులకు స్వేచ్ఛను ఇచ్చామని తెలుపుతూ ఆ దిశగా పోలీసులు విజయవంతం అయ్యారని అన్నారు. సైబర్ నేరాలలో క్రియాశీలకంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచినట్లు ఆయన తెలిపారు. లోక అదాలత్ పయనంలో జ్యూడిషియరీ, పోలీస్ శాఖ మధ్య సమన్వయం కొనసాగాలని అంతిమంగా సమాజంలో వ్యక్తుల మధ్య వ్యక్తిగత కక్షలు ఉండకుండా సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలనే లక్ష్యం తో పోలీసు శాఖ విధులు నిర్వహిస్తుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆకాక్షించారు. సక్సెస్ మీట్ సమావేశ అనంతరం పోలీసు అధికారులకు, పోలీస్ కానిస్టేబుల్ కు జిల్లాజడ్జి, పోలీస్ కమిషనర్ ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్(అడ్మినిస్ట్రేషన్) కోటేశ్వరరావు, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్(ఎ ఆర్) శంకర్ నాయక్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు రాజా వెంకట రెడ్డి, వెంటేశ్వర్ రావు, శ్రీనివాస్, ట్రాఫిక్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నారాయణ, ఎస్ బి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య, అసిస్టెంట్ పోలీస్ ప్రాసిక్యూటర్స్ మహమ్మద్ రహీమోద్దీన్ , రాజేష్ గౌడ్, రాణి, జిల్లా కోర్టు లైజన్ అధికారి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సాగర్ ఒడిలో "శ్రీవాణి" పాఠశాల బతుకమ్మ సంబరాలు

**సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నృత్యాలు.**

**తెలంగాణ ఆడపడుచుల గొప్ప పండుగ.**

**ముఖ్య అతిథులు జడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్ చైర్పర్సన్.**

**వేగుచుక్క న్యూస్, దుబ్బాక, అక్టోబర్ 1:**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను అందరికీ తెలిసేటట్టుగా రంగనాయక సాగర్ ఒడిలో శ్రీవాణి పాఠశాల యాజమాన్యం బతుకమ్మ సంబరాలు నిర్వహించడం సంతోషంగా ఉందని జిల్లా జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు అన్నారు. మంగళవారం చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ వద్ద దుబ్బాక శ్రీవాణి పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి ఆడపడుచులు ఒక్క దగ్గర చేరి తెలంగాణలో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. ప్రతి సంవత్సరం శ్రీవాణి పాఠశాల యాజమాన్యం ఈ పండుగను గొప్పగా జరుపుకోవడం విశేషమని తెలిపారు. రంగనాయక సాగర్ అందమైన టూరిజం ప్రాంతమని ఇలాంటి ప్రాంతంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం మరింత సుందరంగా కనిపిస్తుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థులతో బతుకమ్మ పాటలపై ఆటలు ఆడి ర్యాలీగా రంగనాయక సాగర్ లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థినిలు డీజే పాటలకు కేరింతలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాణి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టుచీరాల పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 1:**

ధన్ పాల్ లక్ష్మీబాయ్, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త దేవి మాతలకు పట్టుచీరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు దేవి నవరాత్రుల సందర్భంగా ఇందూర్ నగరంలోని దాదాపు 250 మండపాలకు పట్టుచీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత 11 ఏళ్ల నుండి తన ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, హిందూ ధర్మంలో శరన్నవరాత్రి పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని, ఈ పండుగ దుర్గాదేవికి అంకితం చేయబడిందని హిందూ బంధువులు అంత ఐక్యతతో, భక్తి శ్రద్దలతో నిర్వహించే దేవి నవరాత్రులకు తమ వంతు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హిందూ ధర్మరక్షణకు, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించే ప్రతి కార్యానికి తన ట్రస్ట్ ద్వారా సేవాలాందించడానికి ముందుంటమన్నారు. అమ్మ ఆశీర్వాదం ఉంటే అన్ని ఉన్నట్లే అని, రాష్ట్ర ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రైతన్నలు సకాలంలో వర్షాలు కురిసి అధిక పంటలు పండించి సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్త ట్రస్ట్ సభ్యులు, బిజెపి నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.





# రూ"2.50 లక్షల ఎల్వోసి అందజేసిన వినయ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 1:**

పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి ఏరియాలో గల మున్సిపల్ 7వ వార్డుకు చెందిన గంగామణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజక వర్గం ఇన్చార్జి వినయ్ రెడ్డి స్పందించారు.సమాచారం తెలువాగానే వినయ్ కుమార్ రెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో వారిని చేర్పించి వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధిముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 2,50,000 రూపాయల ఎల్ఓసిని వారి కుటుంబ సభ్యులకు మంగళవారం వినయ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు వినయ్ కుమార్ రెడ్డికి ఆపదలో వెంటనే ఆదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎన్ వి రవీందర్ రెడ్డి, రాజు భాయ్, మామిడి చంద్రశేఖర్ రెడ్డి, మామిడి ఏలియా రెడ్డి, నాగుల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు.







వేగుచుక్క న్యూస్, కామారెడ్డి : లింగపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, పాఠశాలలో చదువుకునే చిన్నారులు కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మ పాటలతో సంబరాలు చేసుకొని, వాటిని నీళ్ళల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూసీ పేదలకు అండగా ఉంటాం

హైదరాబాద్: మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదలు ఎవరూ తమ ఇళ్లు కోల్పోతారని అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భరోసా కల్పించారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ప్రజాప్రతినిధులు పర్యటిస్తున్నారని, ప్రజలు వారికి తమ బాధలు చెప్పాలని సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, న్యూకమలానగర్ మూసీ పరివాహక ప్రాంతాలలో ఆయన పర్యటించారు. తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇళ్లను కూలుస్తామని చెబుతున్నారని, దీంతో ఆందోళన చెందుతున్నామని చెప్పారు. హైడ్రా అధికారులు ఎప్పుడు వస్తారో అనే భయంతో నిద్రలేకుండా గడుపుతున్నామని మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసి పైసాపైసా కూడబెట్టి, అప్పు చేసి స్థలాలను కొని ఇళ్లు కట్టుకుంటే.. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో కూల్చివేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నించారు. తమ ఇళ్లను కూలిస్తే సహించేది లేదని, అధికారులను ఎదిరిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ పేదల పక్షాన పోరాడుతుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కాలేరు వారికి సూచించారు. అన్ని ప్రాంతాలలో పార్టీ అగ్రనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నాయకులు పర్యటించి వారికి బాధితులకు అండగా ఉంటారన్నారు.

# సామాజిక సేవా కార్యక్రమాల్లో వృద్ధులు పాల్గొనాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 1**

: వృద్దులు ఆరోగ్యవంతంగా ఉంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని వయో వృద్దుల ఫోరం భవనంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్దులు ఆరోగ్యవంతంగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వారం రోజుల పాటు అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవాలను నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. తల్లి దండ్రులను సరిగా చూడని వారికి చట్టం అండగా నిలుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులను పోషించనీ వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. వృద్దులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. యోగ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతీ రోజూ నడక, వ్యాయామం చేయాలని తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ, వృద్దులు తమ మనుమలు, మనుమరాళ్ళతో కాలక్షేపం చేయాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి బాబయ్య మాట్లాడుతూ, వయోవృద్దులను చిన్న పిల్లల్లా చీసుకోవాలనీ, ఆప్యాయంగా పలకరించాలని అన్నారు. వృద్దులను గౌరవించిక్షోవాలనై అన్నారు. నిరాదరణకు గురి అయిన వృద్దులకు చట్టం అండగా నిలుస్తుంది తెలిపారు. యోగ, వాకింగ్, క్యారం వంటి పోటీలను ఈ సందర్భంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం పలువురు వృద్దులను శాలువాలతో సత్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. వృద్దుల సంక్షేమ ఫోరం ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వృద్దుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




**వేగుచుక్క న్యూస్: కామారెడ్డి పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో చిన్నారి "బతుకమ్మ అనన్య".**



# నిలకడగా రజనీకాంత్ ఆరోగ్యం



సూపర్ స్టార్ రజనీకాంత్ అస్వస్థతకు గురై ప్రస్తుతం చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు తలైవాకి చిన్నపాటి సర్జరీ చేశారు. అనుభవగ్నులైన ముగ్గురు వైద్యులు రజనీకాంత్‌కు పొత్తికడుపు కింది భాగంలో స్టెంట్ వేశారు. ఈ పక్రియ విజయవంతమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. రెండు లేదా మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రజనీకాంత్ సోమవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక వైద్యుల బృందం సూపర్‌స్టార్‌కు చికిత్స అందిస్తున్నారు. ఇక తలైవా దవాఖానలో చేరిన విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

# నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు.. 'అన్‌మ్యాచ్‌బుల్'

## రామ్‌చరణ్‌కు సమంత కితాబు







హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ నుంచి తాజాగా 'రా మచ్చా మచ్చా..' అంటూ రెండో పాట విడుదలైంది. ఈ పాట ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ క్రమంలో పాటలో రామ్‌చరణ్ డ్యాన్స్‌పై ఉపాసన, సమంతలు ప్రశంసలు కురిపించారు. రామ్‌చరణ్ తన పాటను షేర్ చేస్తూ.. 'ఈ భారీ పాటను నేను ఆనందించినట్లు.. మీరూ ఆనందిస్తున్నారని ఆశిస్తున్నా' అని రాశారు. ఈ పోస్ట్‌పై ఉపాసన స్పందిస్తూ.. మిస్టర్ సీ.. మీ డ్యాన్స్‌తో హై ఓల్టేజ్ పుట్టించారని రిప్లై ఇచ్చారు. ఇక, సమంత స్పందిస్తూ.. నిన్నెవరూ మ్యాచ్ చేయలేరు అంటూ.. 'అన్‌మ్యాచ్‌బుల్' అని పేర్కొన్నారు. దానికింద ఫార్మల్ ప్యాంట్, షర్ట్ ధరించి ఎవరు ఇలా డ్యాన్స్ చేయగలరు.. అంటూ రాసుకొచ్చారు. ఇదిలాఉండగా.. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో 'గేమ్‌ఛేంజర్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'రా మచ్చా మచ్చా'... పాటని సోమవారం విడుదల చేశారు. ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. నకాశ్ అజీజ్ ఆలపించారు. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో కియారా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్‌తో పాటు పలువురు కీలక ప్రాతల్లో నటిస్తున్నారు.





# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబో

చిత్రంలో సప్తసరాగాలు దాటి.. ఫేం రుక్మిణి వసంత్గ్లోబల్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీకి సీక్వెల్ కూడా రాబోతుంది. కాగా మరోవైపు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ 31 కూడా లాంచ్ చేసి అభిమానులకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పాడు. ఆగస్టులో హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ లాంచింగ్ ఈవెంట్ కూడా గ్రాండ్‌గా జరిగింది. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పుడు రెండు వార్తలు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఈ చిత్రంలో సప్తసరాగాలు దాటి ఫేం రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట. దీనిపై అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని ఇన్‌సైడ్ టాక్.అంతేకాదు ఈ చిత్రం బంగ్లాదేశ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథతో ఉండబోతున్నట్టు ఇంకో వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. బంగ్లాదేశ్‌కు వలస వెళ్లిన తెలుగు వాళ్లకు అండగా నిలిచే పాత్రలో తారక్ కనిపిస్తాడట. మొత్తానికి ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా ప్రేక్షకులకు రీచ్ అయ్యేలా సినిమాను సిద్ధం చేస్తున్నాడని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. ఈ క్రేజీ వార్త అఫీషియల్ కానప్పటికీ మూవీ లవర్స్, ఫ్యాన్ మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.

# ఆ లెజండరీల గురించి నా పిల్లలకు చెబుతా




నటి శోభితా ధూళిపాళ్ల ఆసక్తిక పోస్ట్‌శోభిత ధూళిపాళ్ల. పేరుకి తెలిగింటి ముద్దుగుమ్మే కానీ హవా నడిపించేది మాత్రం బాలీవుడ్‌లో. అద్భుతమైన కథల ఎంపికతో పాటు తనదైన నటన శైలితో శోభిత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అక్కినేని నాగ చైతన్యతో ఎంగేజ్మెంట్ తర్వాత ఈ భామ తరుచుగా న్యూస్‌లో కనిపిస్తున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియన్ సెల్వన్' సినిమా ఫ్రాంచైజీతో ఆమె మరోసారి నేషనల్ వైడ్‌గా తన యాక్టింగ్ కెపాసిటీని నిరూపించుకున్నారు. 'పొన్నియన్ సెల్వన్-1' సినిమా రిలీజై రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చిత్ర బృందంతో కలిసి ఆమె సందడి చేశారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒకటి వైరల్ అవుతోంది. తమిళనాడులో అత్యంత సంచలనం సృష్టించిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన సినిమా పొన్నియిన్ సెల్వన్. రెండు భాగాలుగా తీర్చిదిద్దిన ఈ సినిమా ఘన విజయం సొంతం చేసుకుంది. తాజాగా ప్రకటించిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డులలో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా విక్రమ్ అవార్డ్ అందుకోగా, క్రిటిక్స్ ఛాయిస్‌లో ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ అంతా కలిసి ఫోటో షూట్ నిర్వహించారు. ఈ ఫోటోలను శోభిత ఇన్స్టాలో పోస్ట్ చేస్తూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. ఈ ఫోటోలో హీరో విక్రమ్‌తో పాటు జయం రవి, కార్తి, ఐశ్వర్యారాయ్, త్రిషలతో కలిసి శోభితా ధూళిపాళ్ల ఫోటోలకి పోజ్ ఇవ్వగా 'వీరందరు ఎవెంజర్స్, నా పిల్లలకు వీళ్ల గురించి చెప్తాను' అంటూ ఆమె తన అభిమానాన్ని చాటుకున్నారు. 2016లో బాలీవుడ్ విలక్షణ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'రామన్ రాఘవ్ 2.0' చిత్రంతో తెరంగ్రేటం చేసిన శోభిత హిందీ ఇండస్ట్రీలో స్థిరపడిపోయారు. కాగా 2018లో అడివి శేష్ యాక్షన్ స్పై ఫిల్మ్ 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2022లో వచ్చిన పొన్నియన్ సెల్వన్‌తో మరోసారి జాతీయ గుర్తింపు పొందారు. మరోవైపు మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్ వెబ్ సీరీస్‌లతో ఆమె ఓటీటీలోను ప్రత్యేక గుర్తింపు సాధించారు.

# బేబీజాన్ షూట్‌లో పాల్గొననున్న సల్మాన్



బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. ఓ వైపు లీడ్ యాక్టర్‌గా చేస్తూనే.. మరోవైపు కామియో రోల్‌లో కూడా కనిపించబోతున్నాడు. ఈ స్టార్ యాక్టర్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్న చిత్రం బేబీ జాన్ నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ బాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సల్మాన్ ఖాన్ ఈ మూవీ షూట్‌లో ఎప్పుడు జాయిన్ అవుతాడనే దానిపై ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం అక్టోబర్ మొదటి వారంలో బేబిజాన్ చిత్రీకరణలో జాయిన్ కాబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో వరుణ్ ధవన్, సల్మాన్ ఖాన్‌పై వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేయబోతున్నారట. ఈ సినిమాను డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. బేబిజాన్ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నాడు.



# ప్రభాస్ మూవీలోకి మిథున్ చక్రవర్తి

సలార్', 'కల్కి' సినిమాల సక్సెస్‌తో రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రభాస్ నెక్ట్స్ లైనప్‌తో కూడా ఫ్యాన్స్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సీతారామం చిత్రంతో నేషనల్ వైడ్‌గా క్రేజ్ సంపాదించుకున్న డైరెక్టర్ హను రాఘవాపుడితో ఓ సినిమా చేయనుండటం ఫ్యాన్స్‌కి మరింత కిక్కునిచ్చింది. ఫౌజి వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే ఈ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రకటించడటంతో ఫ్యాన్స్ మరింత సంబరపడిపోతున్నారు. ఇటీవల రిలీజైన 'కల్కి 2898 సినిమాలో బాలీవుడ్ సూపర్ స్టార్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ప్రభాస్ కోసం నటించి మెప్పించాడు. కేవలం యాక్ట్ చేశాడన్నట్లు కాకుండా సినిమాకే ఆయువు పట్టులా వ్యవహరించి తన యాక్టింగ్ ఇంప్యాక్ట్ చూపించాడు. తాజాగా భారతదేశ చలన చిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ పాల్కే అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తిని హను రాఘవపూడి ఫౌజి సినిమా కోసం కాంటాక్ట్ అయ్యారు. ఆయన కూడా ఈ ప్రాజెక్ట్ కి ఓకే చెప్పేశారు. దీంతో మరోసారి ఇంకో బాలీవుడ్

సినిమాలో యూట్యూబ్ సెన్సేషన్ ఇమాన్వి ఇస్మాయిల్ తో పాటు లెజండరీ నటి జయప్రద నటించనుడటంతో సినీవర్గాలల్లో మూవీపై మరింత ఇంట్రెస్ట్ పెరిగింది. తాజాగా మరో లెజెండ్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు లెజెండ్ ప్రభాస్ సినిమాలో కీలకం కానున్నాడు. గతంలో 'గోపాల గోపాల' చిత్రంలో నెగిటివ్ షేడ్స్‌లో తన నటన ప్రావీణ్యంతో తెలుగు ప్రజలకు ఆయన పరిచయమే. గోపాల గోపాల ఒరిజినల్ వెర్షన్ ఓ మై గాడ్ మూవీలోను ఇదే పాత్రలో ఆయన నటించి అవార్డులు సాధించారు. అలాగే దేశంలోనే మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌తో పాటు 3 నేషనల్ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించారు. కాగా ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

# నలంద”లో ఘనంగా బతుకమ్మ సంబురాలు.

**పాటలు, దాండియాతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.**

**పండుగ ప్రాముఖ్యతను వివరించిన యాజమాన్యం ప్రసాద్, సాగర్.**

వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 1: పట్టణంలోని నలంద హై స్కూల్ లో బతుకమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ బతుకమ్మ ప్రాముఖ్యతను తెలిపారు. పండుగను పురస్కరించుకొని తిరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో పాఠశాల ఆవరణ పూల పండుగగా కనువిందు చేసింది. తరగతి కొక్క బతుకమ్మ చొప్పున సుమారుగా 25 బతుకమ్మలు గునుగు, తంగేడు, చామంతి, బంతి గులాబీ పూలతో అలంకరించారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు, దాండియా ఆటలతో పాఠశాలలో ఉత్సాహంగా కొనసాగింది.

అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఊరేగింపులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**విద్యార్థులకు సన్మానం:**

ఎఫ్ఏ 2 పరీక్షల్లో మొదటి మూడు ర్యాంక్స్ సాధించిన విద్యార్థులను కార్యక్రమానికి ముందుగా పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ సన్మానించారు.





































# మహాత్మ మమ్ములను క్షమించు !

ఏటా గాంధీ జయంతి సందర్భంగా నివాళి అర్పించి మొక్కులు తీర్చుకుంటున్న నేతలు దేశ,రాష్ట్ర అభివృద్దిలో మాత్రం గాంధీమార్గం అనుసరించడం లేదు. గాంధీ పేరు చెప్పి చేయాల్సిన దగుల్బాజీ పనులన్నీ చేస్తున్నారు. రౌడీలు రాజ్యమేలుతున్నారు. గాంధీ పాటించిన విలువల్లో ఇసుమంతయినా గ్రహించడం లేదు. అందుకే దేశం ఇన్నేళ్లయినా ముందుకు కదలడం లేదు. అధిక ధరలు, అక్రమాలు, అన్యాయాలు, అత్యాచారాలు పెరగిగి పోతున్నాయి. ఈ దశలో మన గడ్డమీద పుట్టిన మన మహాత్ముడిని, ఆయన ఆశయాలను విస్మరించడం సరికాదు. పాలకులు తమ దృష్టిలో ఒకింత గాంధీమార్గంపై దృష్టి సారిస్తే పల్లెలు, పట్టణాలు, రాష్ట్రం, దేశం బాగుపడగలదు. చిత్తశుద్ది ఉంటే ఎంతటి కఠిన పరీక్షలయినా ఎదుర్కోవచ్చని గాంధీజీ నిరూపించారు. కొందరు అక్కడక్కడా తమ పాలనలో కొంత చిత్తశుద్దిని ప్రదర్శించినా..దేశం మొత్తంగా ఈ ఆలోచన రావాలి. స్వాంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా ఇంకా దరిద్ర నారాయణులగానే అనేకులు మిగిలారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం తప్ప దేశాన్ని గురించి ఆలోచన చేయని నేతలు ఇవాళ రాజ్యమేలుతున్నారు. అప్పనంగా సంపాదించడం, అధికారం వెలగబెట్టడం అలవాటుగా చేసుకున్నారు. కనీసం గాంధీ మార్గంలో గ్రామాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పం రావాలి. అహింసతో ప్రజలను ముందుకు తీసుకుని వెళ్లాలి. ప్రజలే తమ అధికారానికి కారకులు కనుక వారికి మేలు చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగాలి. నేటికీ గ్రామాల స్వయం సమృద్ధి సాధ్యం కాకపోవడానికి పాలకుల విధానాలే కారణం. గ్రామాలను సర్వతోముఖాభివృద్ధికి పాటుపడి ,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టడంలో లేదా బలోపేతం చేయడం ఇంకా నినాదాలతోనే సరిపుచ్చుతున్నారు. అభివృద్ధి అన్నది నినాదంగా మిగిలిపోరాదు. గ్రామలను అభివృద్ధి చేస్తూ మౌళిక సదుపాయాల కల్పనలో ఖచ్చింతంగా ఓ విధాన నిర్ణయంగా సాగాలి. అప్పుడే గాంధీ మార్గంలో నడుస్తున్నామని చెప్పుకోవచ్చు. ఆయనకు నిజమైన నివాళి అర్పిస్తున్నామని చెప్పుకుంటున్న వారు ఇందుకు తగిన విధంగా అడుగులు వేస్తున్నామా అన్నది ఆలోచించాలి. కేవలం గాంధీని స్మరించడంతో ఆశయాలు నెరవేరవు. మహాత్ముడి ఆశయాలు నెరవేరాలంటే ఆయన ప్రవచించిన సిద్దాంతాలను కొంతయినా నెరవేర్చేలా యత్నించాలి. అధికారం ఉన్నా..నిధులు సమకూరుతున్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఎందుకు మార్చలేకపోతున్నామో అన్నది నేటి పాలకులు ఆలోచించాలి. గాంధీజీ చెప్పిన చాలా విషయాలు నేటి ఉద్యమాలకు, ప్రభుత్వాల కు, దేశాలకు ఎజెండాలవుతున్నాయి. ప్రపంచానికి మహాత్మా గాంధీ శాంతి మార్గాన్ని చూపడమే కాకుండా గొప్ప ఆధ్యాత్మిక సంపదను వారసత్వంగా అందించారు. గాంధీజీ తన బోధనలు, నడవడి ద్వారా ప్రపంచానికి గొప్ప ఆధ్యాత్మిక వారసత్వ సంపదను అందించారు. గాంధీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింసా మార్గంలో నడిపించిన తీరుతోనే ఆయనపై నేటికి పరిశోధనలు కొనసాగుతున్నాయి. అనేక దేశాలు ఆయన చూపిన మార్గంలో పయనించే ప్రయత్నాలు చేస్తున్నాయి. సామాజిక కార్యకర్త అన్నా హజారే కూడా గాంధీ చూపిన అహింసామార్గంలోనే ముందుకు సాగి దేశంలో కదలిక తీసుకుని వచ్చారు. గాంధీ తర్వాత అవినీతి గురించి, రాజకీయాల్లో మార్పు వంటి అంశాలు జాతీయ అజెండా అయ్యాయి. అవినీతికి వ్యతిరేకంగా రాలేగాంవ్ సిద్దీలో ఉండే హజారే యావత్ దేశాన్ని కదలించాడు. ముఖ్యంగా ఈ తరం అంతా జాతీయ జెండాలతో ఆయన వెనుకే నిలబడింది. లాఠీ దెబ్బలు లేకుండా, హింసాపద్దతలకు తావీయకుండా ఆయన జాతీయ జెండా చేత పట్టారు. గాంధీ టోపీ పెట్టారు. 'గాంధీనే నా మార్గం' అన్నారు. యావత్ దేశాన్ని తన వెంట నడిపించుకున్నారు. ఈ తరం నెత్తుల మీద గాంధీ టోపీలు పెట్టుకోవడానికి నాటి గాంధీ ఆలోచన, ఆచరణ తప్ప మరోటి కాదు. అంటే ఉద్యమాలు చేసే వారికి తరతమ బేధాలు లేకుండా ఉద్యమంలోకి వచ్చే స్పూర్తికి గాంధీనే పునాది అని గుర్తించాలి. నేటి రాజకీయ నాయకులు బాపూను తలచి దండలు వేయడం తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు. ఈ దేశం ఎంతో ప్రగతి సాధించడానికి అవకాశం ఉన్నా స్వార్థ రాజకీయాల కారణంగా ముందుకు సాగలేకపోయాం. ఆ సంకల్పంతో ఆయనకు నివాళి అర్పిస్తే బాపూ కూడా ఆనందిస్తాడు. తాను నమ్మిన అహింసా సిద్దదాంతం కావచ్చు లేదా... ఉద్యమపంథా కావచ్చు...ఆచరించి బ్రిటీషు వారికి వ్యతిరేకంగా గాంధీ దేశంకోసం పోరాటం చేశారు. బ్రిటీషు వారిచేతనే భేష్ అన్పించుకోవడమే గాకుండా వారిని గడగడలాడించారు. గాంధీ ప్రత్యేకత అంటే అదే. ఆయన తను చెప్పిన సిద్దాంతాన్ని ఆచరించారు గనుకనే అశేషమైన ప్రజల మద్దతు సాధించగలిగారు. దేశ ప్రజల ఆలోచన స్థితిని, వారి చైతన్యాన్ని గుర్తించి వారిని ఉద్యమంలోకి రప్పించాలో గ్రహించిన గాంధీ స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారు. అందుకే ఆయన నాటి భారత సమాజాన్ని కదలించేందుకు చాలా చిన్నచిన్న విషయాలనే ఎంచుకున్నారు. అంతే కాదు ప్రజల నిత్య జీవితంపై ప్రభావం చూపించే ఉప్పును ఉద్యమానికి ఆయుధం చేసుకున్న ధీశాలి. నిత్యావసరాలను, అత్యంత ప్రభావం చూపే అంశాలే ఆయన ఉద్యమ ఇతి వృత్తాలు. అందుకే దండి ఉప్పు సత్యాగ్రహం యావత్ దేశాన్ని కదలించింది. అందుకే అంతకు ముందు ఎంతో మంది స్వతంత్ర ఉద్యమాన్ని నడిపినా గాంధీకి ముందు గాంధీ తర్వాత అనే విభజన రేఖ వచ్చింది. అంతలా ఉద్యమాలను, ప్రజలను, పాలకుల ను గాంధీ ప్రభావితం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లవారిని తరిమి కొట్టేందుకు ఎలాంటి ఆయుధాలు అక్కర్లేకుండా ముందుకు సాగిన ఉక్కు సంకల్పం గాంధీ సొంతం. నాడు బ్రిటీషు ప్రభుత్వం పై యుద్దం చేయడానికి ఆయన అహింసను ఆయుధంగా చేసుకున్నాడు కనుకనే బలవంతులైన వారిని ఎదిరించ గలిగారు. ప్రజలు కూడా ఎక్కడిక్కడా అహింసతో అడ్డుకున్నారు. గోచీ పెట్టుకున్న ఈ పెద్దాయన తో తమకు పేచీ లేదని బ్రిటిషు పాలకులు భావించేలా చేశారు గాంధీ. కానీ ఆయనే తన శాంతియుత పద్దతులతో బ్రిటిషర్లను గడగడలాడించాడు. ఆనాటి ఉద్యమాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు గాంధీ పట్ల ఆరాధ్య భావం పెంచుకున్నారు. ఆయన ఉద్యమానికి ముగ్దులయ్యారు. ఇంతటి అసాధారణ ప్రతిభ కలిగిన ఓ వ్యక్తి రక్త మమాంసాలతో ఈ భూమ్మీద జీవించాడంటే నమ్మలేకపోతున్నా మంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ గాంధీ గురించి చేసిన వ్యాఖ్యలు మహాత్ముడి గొప్పతనానికి నిదర్శనాలు. తాను చెప్పిన సిద్దాంతాన్ని ఆచరించి చూపిన మహనీయుడు బాపు. ప్రజలను తమ సమస్యల పట్ల ముందుకు తీసుకుని వెళ్లాలన్న విషయాలను సూటిగా, భక్తి మార్గంలో, నైతిక మార్గంలో బోధించారు.

# ఆర్కిడ్స్"లో ఘనంగా బతుకమ్మ వేడుకలు.

**ఆటపాటలతో అలరించిన విద్యార్థులు.**

**పాల్గొన్న పాఠశాల చైర్మన్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, ఆర్కే గ్రూప్ ఆఫ్ సీఈఓ జైపాల్ రెడ్డి.**

**ొవేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 1:**

పట్టణంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకలలో విద్యార్థినిలు వివిధ రకాల పువ్వులతో రంగురంగుల బతుకమ్మలను తయారుచేసి, వివిధ రకాల వస్త్రాధారణలతో అందరిని అబ్బుర పరిచారు. విద్యార్థిని, విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో, ఆటపాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ సి.హెచ్. గోవర్ధన్ రెడ్డి, మాట్లాడుతూ, తెలంగాణ బతుకమ్మ పండుగ, సంస్కృతి సంప్రదాయాలను, బతుకమ్మ విశిష్టత, ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం రంగు రంగుల బతుకమ్మలను సాయిబాబా గుడి వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి తో పాటు , ఆర్కే గ్రూప్ ఆఫ్ సీఈఓ జైపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ సదాశివరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి , డీన్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.














# తప్పడు వాగ్దానాలతో తప్పదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

చండీగఢ్:హస్తం పార్టీ అన్ని తప్పుడు వాగ్దానాలే చేస్తుంటుందని కాంగ్రెస్ పార్టీ పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాల్వాల్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ప్రధాని ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. దేశం కోసం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. అయోధ్య నిర్మాణంలోనూ అడ్డు చెప్పింది. జమ్మూకశ్మీర్‌లో పూర్తి స్థాయిలో రాజ్యాంగాన్ని అమలు చేయాడాన్ని వ్యతిరేకించింది. పార్లమెంట్, విధాన సభల్లో మహిళలకు రిజర్వేషన్లను నిరాకరించింది. కాంగ్రెస్.. దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. కానీ, తమ కుటుంబాన్ని మరింత బలోపేతం చేయడానికి శ్రమించిందని కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.



ప్రజల్లోని దేశభక్తిని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ప్రజల్లో యూనిటీ ఎంత బలంగా ఉంటే.. కాంగ్రెస్ గెలుపు కూడా అంతే అసాధ్యం అని భావిస్తోంది. అందుకే దేశభక్తుల ఐక్యతను నాశనం చేసేందుకు ఆ పార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. రాష్ట్రంలో భాజపా పదేళ్లుగా అధికారంలో ఉందని, ఇక ప్రజలు తమకు అధికారం అప్పగిస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. గతంలో మధ్యప్రదేశ్ విషయంలోనూ ఇదే విధంగా అపోహ పడింది. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఇదే చేసింది. హరియాణాలోనూ తన వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తోంది. వారి కుట్రను మనమంతా భగ్నం చేయాలని మోదీ పేర్కొన్నారు. కేంద్రం రద్దు చేసిన ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ చెబుతోంది. కానీ, పాక్ ఆక్రమిత ప్రాంతాన్ని (పీవోకే) వెనక్కి తీసుకొస్తామని ఎన్నడైనా చెప్పిందా..?పాకిస్థాన్‌కు మద్దతుగా ఉండే ఆ పార్టీ.. హరియాణా ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించగలదా..? అని ప్రశ్నించారు. కాగా.. హరియాణాలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయా పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఎన్నికలకు కొద్ది సమయమే ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

# పేదల కలలను చిదిమేస్తున్నారు

హైదరాబాద్: ఇక్కడ పేదల గృహాలను కూల్చేస్తున్నారు. వారి కలలను చిదిమేస్తున్నారు. ఆ కూలిన ఇంటి శిథిలాలతో వారి జీవితాలను వెతుక్కుంటున్నారు అంటూ తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ను ఏఐసీసీ అగ్ర నేత రాహూల్ గాంధీకి సైతం ట్యాగ్ చేశారు. హైదరాబాద్ లో మూసీ నది ప్రక్షాళన కోసం అక్రమ కట్టడాలను తొలగిస్తుండగా.. అక్కడ కొందరు చిన్నారులు ఇంటి శిథిలాల వద్ద దీనంగా ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ వీడియోను పోస్ట్ చేస్తూ.. కేటీఆర్ ఈ కామెంట్స్ చేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా శంకర్ నగర్, చాదర్‌ఘాట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఇంటిని కూలగొడితే.. తమ చిట్టి చేతులతో అమాయకంగా ఒక్కొక్క రాయిని పేర్చుతూ పిల్లలు ఆడుకుంటున్నారు.మూసీ సుందరీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడి ఆక్రమణలను తొలగిస్తోంది. మూసీ ప్రక్షాళన ప్రభుత్వ ధ్యేయమంటూ.. అక్కడి ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ గృహాలను మంజూరు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్కడి నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి సహకరించే స్థితి ప్రస్తుతం ఉందని చెప్పవచ్చు. మంగళవారం నుండి అక్కడి ఆక్రమణలను ప్రభుత్వం తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇరువురు చిన్నారులు తమ ఇంటి శిథిలాల వద్ద ఆడుకుంటూ ఉండగా.. ఎవరో ఆ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ వీడియోపై మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. వారి గూడుని కూల్చేసారు.. వారి కలలను చిదిమేసారు.. ఆ కూలిన ఇంటి శిథిలాలలో వారి జీవితాలను వెత్తుకుంటున్నారు.. మంత్రులను వచ్చి చెప్పమనండి.. వీళ్ళు కూడా డబ్బులు తీసుకున్నారని, మీరొచ్చి ఆ చిట్టి తల్లులకు చెప్పండి.. మీ ఇళ్ళు కూల్చి, మాల్స్ కడుతున్నాము.. మీ బ్రతుకులు బాగుపడతాయని.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన అంటూ ట్వీట్ చేసి రాహూల్ గాంధీకి ట్యాగ్ చేశారు. కాగా ఇటీవల మాజీ మంత్రి హరీష్ రావు సైతం రాహూల్ గాంధీకి లేఖ రాశారు. వెంటనే కాంగ్రెస్ పెద్దలు స్పందించాలని, మీరు సాధించే తెలంగాణ అభివృద్ధి ఇదేనా అంటూ హరీష్ రావు లేఖలో పేర్కొన్నారు. అయితే మూసీ ప్రక్షాళన కోసం కూల్చివేతలు సాగుతుండగా.. కాంగ్రెస్ సర్కార్ పై బీఆర్ఎస్ విమర్శలను గుప్పిస్తోందని అన్నారు.

# అమెరికాలో చదువుకున్నావ్ నీకు కామన్ సెన్స్ ఉందా?

హైదరాబాద్: అమెరికాలో చదువుకున్నావు.. అసలు నీకు కామన్ సెన్స్ ఉందా అంటూ మాజీ మంత్రి కేటీఆర్ పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శివాలెత్తారు. అంతటితో ఆగక.. మూసీ మీద చర్చకు నీ అయ్యను రమ్మను కేటీఆర్ అంటూ సవాల్ విసిరారు మంత్రి. దీనితో మూసీ ప్రక్షాళన వేదికగా.. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు జోరందుకున్నాయి.హైదరాబాద్ నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించింది. మూసీ సుందరీకరణకై ప్రక్షాళన చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. మూసీ పరివాహక ప్రాంతంలో 55 కి.మీ పరిధిలో మొత్తం 40 వేల ఆక్రమణలను అధికారులు గుర్తించారు. తాజాగా వాటి కూల్చివేతలను సైతం ప్రారంభించారు అధికారులు. అయితే మూసీ పరివాహక ప్రాంతంలో గల ఆక్రమణదారులు మాత్రం నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో.. ప్రభుత్వం వారికి డబుల్ బెడ్ రూమ్ గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం చేస్తున్న చర్యల పట్ల బీఆర్ఎస్ ముందు నుండి విమర్శలు గుప్పిస్తోంది. అయితే కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో ఎదురుదాడికి దిగింది. తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొంచెం ఘాటుగానే బీఆర్ఎస్ పై విమర్శలు చేశారు. అంతేగాక డైరెక్ట్ గా మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా సైతం విమర్శలు ఎక్కుపెట్టారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను మూసీ ప్రక్షాళన కోసం 11 రోజులు దీక్ష చేసినట్లు, మానవత్వం ఉన్న ప్రతి మనిషి మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇస్తారన్నారు. ఇక్కడి ఆక్రమణలు తొలగించేందుకు ప్రజలను ఒప్పిస్తామని, అలాగే ప్రభుత్వం తగిన రీతిలో సాయం చేసేందుకు సిద్దంగా ఉందన్నారు. ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి మానవత్వం లేదని, అందులో కేసీఆర్, కేటీఆర్ లకు అస్సలు లేదన్నారు. అమెరికాలో చదవుకున్నావ్.. కేటీఆర్ అసలు నీకు కామన్ సెన్స్ ఉందా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. త్వం ప్రజా సంక్షేమ పాలన సాగిస్తుంటే.. మరో వైపు ఓర్వలేని బీఆర్ఎస్ ప్రజలను పలు విధాలుగా రెచ్చగొడుతుందన్నారు. అయితే ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేదని, ఇప్పటికైనా బుద్ది మార్చుకోవాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు తాము పాటుపడుతుంటే.. అభివృద్దిని అడ్డుకొనేందుకు బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తుందన్నారు.